# డాడీ, వియ్ నీడ్ లవ్!

## తిరుమలశ్రీ

పిల్లలు బయట క్యారమ్స్ ఆడుతున్నారు వారి అరుపులతో కేరింతాలతో వరండా దద్దరిల్లి పోతోంది

అల్లరికి తనలో తానే నవ్వుకుంటోంది వంట వసారాలో కాఫీ కలుపుతున్న శశికళ

గదిలో పడక కుర్చీలో పడుకుని ఆనాటి దిన పత్రికను చదువుతున్న ప్రతాపరావుకు పిల్లల గోల వినిపిస్తూనే వుంది

అయినా విసుక్కోలేదతను రవి అతని మిత్రులూ చిన్న పిల్లల్లా అరచి గోల చేయడం వింతగా అనిపిస్తోంది సరదాగానూ వుంది

రవికి పదిహేనేళ్ళు టెన్త్ చదువు తున్నాడు అతని స్నేహితులు కిరణ్ రాజేష్ సతీష్‌లదీ అదే వయసు అంతా క్లాస్ మేట్స్

ఆ రోజు ఆదివారం కావడంతో రవి ఇంటి దగ్గర సమావేశమయి క్యారమ్స్ ఆడుకుంటున్నారు అందుకే ఆ అరుపులూ కేరింతాలూను

ఆ టీనేజ్ పిల్లల సరదా సంతోషమూ – ప్రతాపరావుకి శశికళకూ ఆనందాన్నీ పుత్సాహాన్నీ కలిగిస్తూ వుంటాయి

ఆ వయసులోని తమ అనుభవాలను నెమరు వేసుకుని మురిసి పోతూంటారు

ఆ పసి వయసు – మనిషి జీవితంలో పసిడి వయస్సు!

చీకూ– చింతా కుళ్ళూ – కల్మషము లేకుండా స్నేహ మాధుర్యాల స్రవంతిలో మునిగి తేలుతూ ఫ్రీ బర్డ్స్‌లా తిరిగే బంగారు ప్రాయమది

అదేమాట ప్రతాపరావు అంటే – ఆ బంగారు ప్రాయంలో అంతిమ సోపానమే – టీ నేజ్ అంటుంది శశికళ టీనేజ్‌కి ముందు సంవత్సరాలను తలచుకుంటూ

అయితే–

ఒకే ఒక విషయం ప్రతాపరావుని తరచు బాధిస్తూ వుంటుంది రవి తన స్నేహితుల్ని ఇంటికి తెచ్చినా తన స్నేహితులను గూర్చి ప్రస్తావించినా ఆ బాధ ఇనుమడిస్తూ వుంటుంది

ప్రతాపరావు గవర్నమెంటు ఆఫీసులో ఓసాధారణ గుమాస్తా ఒక గది వసారా గల ఓ ఇరుకు కూపంలో కాపురం అతనిది ఏకైక సంతానమయినా కొడుక్కి కాస్త ఖరీదయిన బట్టలు కొని పెట్టే స్తోమత కూడా లేనంత పేద జీవితం అతనిది వాడికి తాము ఇవ్వగలిగింది పుష్కల మయిన ప్రేమానురాగాలు మాత్రమే!

అయితే – చదువులో ఫస్టున వుండే రవికి స్నేహమంతా ధనవంతుల పిల్లలతోనే

కిరణ్ తండ్రి ఓ బిజినెస్ మాగ్నేట్ కిరణ్ స్కూలుకి ఓడల్లాంటి కార్లలోనే వస్తూంటాడు అత్యంత విలువయిన దుస్తులు ధరిస్తూ వుంటాడు పుష్కలంగా డబ్బు ఖర్చు చేస్తూ వుంటాడు

రాజేష్ తండ్రి ఓ పెద్ద ఆఫీసర్ అయితే సతీష్ ఓ కంట్రాక్టర్‌కి ముద్దుల పట్టి ఖరీదయిన జీవితం ఆ పిల్లలది అలాగని అల్లరి చిల్లరగా తిరిగే రకం కాదు వాళ్ళు తెలివయిన వాళ్ళు బాగా చదువు కుంటారు

ఆ నలుగురూ మంచి స్నేహితులు అయితే ఆ నలుగురిలోనూ అన్ని విధాలా నాసిగా కనిపించేది రవి ఒక్కడే ఖరీదయిన దుస్తులలో నవ–నవలాడే మిత్రుల మధ్య సాదారణపు వెలిసిపోయిన కాటన్ దుస్తులలో వేర్పాటుగా కనిపించే కొడుకును చూస్తూంటే మనసు చివుక్కుమంటూ వుంటుంది ప్రతాపరావుకి ఒక్కగా నొక్క కొడుకైనందుకు వాడికి ఓ మంచి గుడ్డయినా కొనలేకపోతున్నానే అన్న వ్యధ కలచి వేసేది అతన్ని

స్నేహితులతో వున్నపుడు రవి యొక్క ప్రవర్తనను ఫీలింగ్సునీ చాటుగా గమనిస్తూంటాడు ప్రతాపరావు కుర్రాడు తనను స్నేహితులతో పోల్చుకుని కించపడుతున్నాడేమో నన్న అనుమానం పీడించేది వారి ఐశ్వర్యం ముందు తన పేదరికానికి న్యూనత చెంది లోలోపల బాధపడుతున్నాడేమో ననిపించేది అయితే తెలివయిన కుర్రాడు కావడంతో బయటకు తేలడం లేదు అనుకునేవాడు

స్నేహితులు వెళ్ళాక తల్లి దగ్గరకు వచ్చాడు రవి

మమ్మీ! కిరణ్ డాడీ వాడికి సరికొత్త స్కూటర్ కొన్నారట రేపు స్కూలుకి దానిమీదే వస్తాడట వాడు అంటూ చెప్పాడు పుత్సాహంగా

తనకే కొన్నంత సంబరంగా వాడు చెబుతూంటే ఆలకిస్తున్న ప్రతాపరావుకి మనసు చివుక్కుమంది– రోజూ మూడు కిలో మీటర్ల దూరంలో వున్న స్కూలుకి కాలి నడకను వెళ్ళొచ్చే రవిని తలచుకుని

మమ్మీ! ఇవాళ సతీష్ తొడుక్కున్న బట్టలను చూసావుకదూ? వాళ్ళ డాడీ ఫారిన్ నుంచి తెప్పించారట అవి! బావున్నాయి కదూ? అని రవి తల్లితో చెబుతూంటే – కూర్చున్న చోటు నుంచే కొడుకు వంక చూసాడు ప్రతాపరావు

రవి వదనం సంతోషంతో వెలిగి పోతోంది అయితే వాడు తొడుక్కున్న దుస్తులు మాత్రం రంగు వెలసి పోయి వెల–వెల పోతున్నాయి

తనకు తెలీకుండానే గిల్టీగా ఫీలయ్యాడు అతను

* * * * *

ఆ రోజు–

రవి స్కూలు నుంచి వస్తూనే కాళ్ళూ– చేతులూ కడుక్కోకుండానే సరాసరి తల్లి దగ్గరకు పరుగెత్తాడు

కొడుకు వరుస చూసి శశికళ వాడేదో వార్త మోసుకు వచ్చినట్లు గ్రహించింది

ఏమిటి రవీ? మీస్కూల్లో ఈ రోజు ఏదయినా విశేషం జరిగిందా? అంటూ ప్రశ్నించింది చిరునవ్వుతో

ఔను మమ్మీ! మా క్లాసు పిల్లల్ని మద్రాసు ఎక్స్‌కర్షన్‌కి తీసుకు వెళతారట మనిషికి మూడు వందలు అవుతుందట అన్నాడు రవి పుత్సాహంగా

మాట్లాడలేదు శశికళ

మద్రాసు ఎంతో బావుంటుందటకదు మమ్మీ? అక్కడ చక్కగా మెరీనా బీచ్ ఎయిర్ పోర్ట్ సి పోర్ట్ హార్బరులో పెద్ద –పెద్ద ఓడలూ మహా బలిపురం ఓహ్! చూడాల్సిన ప్రదేశాలు చాలా– చాలా వున్నాయట! ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు వాడు మా క్లాసు పిల్లలంతా తప్పక వెళతారట మమ్మీ! కిరణ్ రాజేష్ సతీష్‌లు అప్పుడే మాస్టారికి తమ పేర్లు కూడా ఇచ్చేసారు

జాలిగా మందహాసం చేయడం మినహా ఏమీ అనలేక పోయింది శశికళ తమ పరిస్థితి ఏమిటో తనకు బాగా తెలుసును మూడు వందలు కట్టి కొడుకును ఎక్స్‌కర్షన్‌కి పంపే స్తోమత తమకు ఎక్కడిది!?

నెమ్మదిగా మాట మార్చి వాష్ చేసుకుని రా నాన్నా కాఫీ ఇస్తాను అంది

కాఫీ త్రాగేసి రోజూలా ఆటలకు వెళ్ళిపోకుండా ఇంకా అక్కడే తచ్చాడుతున్న కొడుకుని చూసి ఏదో అర్థమయిందానిలా లోలోపలే జాలి పడింది శశికళ

ఇంకా ఆటలకు వెళ్ళలేదా రవీ? అని అడిగింది మామూలుగా

ఇవాళ వెళ్ళడం లేదు మమ్మీ! అని జవాబిచ్చాడు వాడు

ఏమీ అనలేదామె

కొంతసేపాగి మళ్ళీ తల్లి దగ్గరకు వచ్చాడు వాడు

"మమ్మీ! పిక్నిక్ గురించి డాడీని అడగమంటావా? అని అడిగాడు మెల్లగా

ఏం చెప్పగలదు తాను?

అయినా, చెంబుడు చన్నీళ్ళు వాడి వుత్సాహంపైన గుమ్మరించడం ఇష్టం లేక చెప్పి చూడు" అంది తెచ్చి పెట్టుకున్న నవ్వుతో

తల్లి అలా అనడంతో కొంత ధైర్యం వచ్చింది వాడికి

కాసేపు తండ్రి కూర్చున్న చోటనే తచ్చాడాడు

అంతకుముందే ఆఫీసు నుంచి వచ్చి పడక కుర్చీలో విశ్రాంతి తీసుకుంటూన్న ప్రతాపరావు అంతా అలకిస్తూనే వున్నాడు చేతిలోని న్యూస్ పేపర్ని అడ్డు పెట్టుకుని అంతా గమనిస్తూనే వున్నాడు కొడుకు అక్కడక్కడే తచ్చాడడం తెలుస్తూనే వుంది కొడుకు తనను అడగాలనుకుంటూన్న దేమిటో తానెరుగును అడగడానికే ధైర్యం చాలక తచ్చాడుతూ వున్నాడన్న సంగతీ గ్రహించాడు కాని ఏం చేయగలడు తాను? "

ఎలాగైతేనేం కొంత సేపటికి ధైర్యం పుంజుకున్నట్టున్నాడు, మెల్లగా తండ్రిని సమీపించాడు రవి

"డాడీ! అన్నాడు

పేపర్ ప్రక్కకు తొలగించి, 'ఏమిటన్నట్టు' చూసాడు ప్రతాపరావు

స్కూల్ పిక్నిక్ గురించి చెప్పాడు రవి వుత్సాహంగా

మనంతట మనం వెళ్ళాలంటే రెట్టింపు ఖర్చవుతుందట, డాడీ! పైగా నలుగురితో కలిపి వెళితే ఎంచక్కా ఎంజాయ్ చేయొచ్చునని మా మాస్టారు చెప్పారు" అన్నాడు

ఊఁ" అన్నాడు ప్రతాపరావు

లోలోపల బాధగా వున్నదతనికి పసివాడి కోర్కె తీర్చలేని తన అశక్తతకు.

"నా ఫ్రెండ్సు అంతా వెళతారట నేనూ వెళ్ళనా, డాడీ?"

చివరకు తెగించి అడిగేసాడు రవి

'ఔను, కాదు' అనలేక పోయాడు ప్రతాపరావు

సాలోచనగా కొడుకు ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు కొన్ని క్షణాలపాటు

తండ్రి చూపులకు అర్థం తెలీక ఏదో తప్పు చేసినవాడిలా తల వంచుకున్నాడు రవి

భర్త ఏం చెబుతాడో అన్న కుతూహలంతో వంటింట్లోంచి చెవులు అప్పగించింది శశికళ

చేయి చాపి కొడుకును ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు ప్రతాపరావు

'చూడు, నాన్నా! ఈ ఏడాది టెన్త్ పాసవుతావు నువ్వు ఆతరువాత నిన్ను కాలేజీలో చేర్పించాలంటే తగినంత సొమ్ము కావాలిగా మరి? ఇప్పుడు పిక్నిక్స్ అంటూ వందలు ఖర్చు చేసేస్తే తరువాత నీ కాలేజ్ ఫీజులకు సమస్య రాదూ? నువ్వు బాగా చదువుకుని వృద్ధిలోకి వస్తే మద్రాసే ఏమిటి – బొంబాయి, ఢిల్లీ వగైరా మహా నగరాలు ఎన్నయినా చూడొచ్చును పిక్నిక్‌కి వెళ్ళడం లేదని నిరుత్సాహపడకు పరీక్షలకు బాగా ప్రిపేరయి ఫస్టు మార్కులతో పాసవ్వు

అంతకంటే ఏం చెప్పాలో, ఎలాచెప్పాలో తెలీలేదు ప్రతాపరావుకి

అంతవరకు వుత్సాహంతో ఆశతో వెలిగిపోయిన రవి వదనం, తన పలుకులతో ఫ్యూజు పోయిన బల్బులా అయిపోవడం చూసి, మదిలో కలుక్కుమంది అతనికి

అప్రయత్నంగా వంట గది వైపు చూశాడు చాటుగా కన్నులు తుడుచుకుంటూన్న భార్య కనిపించింది


అపరాధిలా ముఖాన్నికి న్యూస్‌పేపర్ అడ్డు పెట్టేసుకున్నాడు

రవి ఇంకేమీ అనలేదు తండ్రి పలుకులకు బుద్ధిమంతుడిలా తల వూపి అక్కడినుంచి వెళ్ళిపోయాడు గదిలో మూలనున్న చాప తెచ్చుకుని పరచుకుని పుస్తకాలు ముందు వేసుకుని కూర్చున్నాడు, హోమ్ వర్క్ చేసేందుకు

రవిని చూస్తుంటే ప్రతాపరావు మస్తిష్కంలో రక–రకాల ఆలోచనలు, వూహలు చెలరేగాయి

రవి ఏమీ అనడేం?

తన కోర్కె తీరని ప్రతిసారీ ఎందుకలా–



# డాడీ, వియ్ నీడ్ లవ్!

మౌనంగా వుండిపోతాడు?

తనకోర్కె తీర్చి తీరాలంటూ ఎదురు తిరగడేం?

కనీసం ప్రొటెస్ట్ చేసినా బావుండు ననిపిస్తోంది

అందువల్ల ఆకుర్రాడిలో అణిగివున్న ఆగ్రహం వేడి బయటపడతాయి ఆతరువాత మనసు తేలికవుతుంది

అంతేకాదు- వాడి మనసులో ఏమున్నదో తెలుసుకునే అవకాశమూ వుంటుంది

కాని-

రవి మౌనం ప్రతాపరావును ఎంతో బాధిస్తుంది

బాధకంటె ఎక్కువగా భయపెడుతోంది!

కారణం - ఏళ్ళ తరబడి లోలోపల పేరుకు పోయిన అసంతృప్తి నిరాశ నిస్పృహలు కాల క్రమంలో కొడుకును ఏం చేస్తాయో నన్న ఆందోళన!

పైగా-

ఎందుకు వీలుకాదు? నాకిది తెచ్చి ఇవ్వాల్సిందే! అంటూ రవి ఎదిరించి గొడవ చేసినట్టయితే తండ్రిగా కన్న కొడుకు కనీసావసరాలను సయితం తీర్చలేని అసమర్ధుడిగా తనలో నిండుకున్న అసంతృప్తి ఆవేదన- ఎదిరించి వొత్తిడి చేసే కొడుకు పైన ఆగ్రహంగా వెలువడి తన మనసు కూడా తేలిక పడేది!

కాని- తనకు ఆ అవకాశాన్ని ఇవ్వడం లేదు రవి

తండ్రి చేతకాని తనాన్ని మౌనంతో అంగీక రించడం నేర్చుకున్నాడు

వాడి మనసులో నా పట్ల ఈ ఇంటి వాతా వరణం పట్ల అసంతృప్తి బాగా నిండుకుని వుంటుంది అది ఏదో ఒకనాడు లావాలా ప్రేలు తుంది పొంగి పొరలుతుంది అయితే అది ఏ రూపం దాల్చుతుందో! తమను తమ కుటుంబాన్ని ఏ విధంగా ముంచుతుందో! అన్నదే భయంగా వుంది అనుకున్నాడు ప్రతాపరావు

ఆ ఆలోచనల మూలంగా వెలువడ బోయిన నిట్టూర్పును బలవంతంగా అణచు కున్నాడు

* * * * * *

రవి వాడి స్నేహితులూ టెన్త్ క్లాస్ ఫస్టు క్లాసులో పాసయ్యారు అందరికీ మంచి మార్కులు రావడంతో కాలేజీలో సీట్లు దొరకడం కష్టం కాలేదు

రవి కాలేజ్ స్టూడెంటు అయినా వాడి స్థితిలో మార్పు లేదు వాడి మదిలో ఏమున్నదో కాని పైకి మాత్రం వాడు ఏనాడూ తేలలేదు-

కాని-

నిత్యమూ కొడుకును చూస్తే లోపల్లోపల గిల్టీగా ఫీలవడం మానలేదు ప్రతాపరావు

ఇలా వుండగా-

ఒకనాటి సాయంత్రం కాలేజ్ నుంచి తిరిగి వస్తూనే రవి చెప్పిన వార్త నిర్ఘాంత పరచింది ప్రతాపరావు శశికళలను

కిరణ్ ఇంటి నుంచి పారిపోయాడట మమ్మీ! విచారంగా అన్న రవి పలుకులు వింటూనే తెల్ల బోయాడు ప్రతాపరావు

కిరణ్ నగరంలో పేరున్న బిజినెస్ మాగ్నెట్ ఏకైక పుత్రుడు పెద్ద భవనం నౌఖర్లు ఓడల్లాంటి కార్లు విలువయిన దుస్తులు పుష్కలంగా డబ్బు చక్కని తెలివి తేటలు మంచి చదువు ఖరీదయిన జీవితం నోరు తెరచి అడక్కుండానే అన్నీ అమర్చే తల్లి దండ్రులూ అన్నీ వున్న కిరణ్ ఇంటి నుంచి చెప్పా చేయకుండా పారిపోవలసిన ఖర్మ ఏమిటి?!

రవిలాంటి కుర్రాడు వయసుతో పాటు ఎదిగే తీరని కోర్కెలతో అవసరాలతో చెలరేగే అసంతృప్తితో రగిలే నిరాశతో ఇల్లు విడిచి వెళ్ళిపోయాడన్నా అర్ధం వుంటుంది!

కాని కిరణ్‌లాంటి బంగారం లాంటి కుర్రాడి కేమిటి ఈ అవస్థ అవసరమూను? అనిపించింది ప్రతాపరావుకి

తన ఆశ్చర్యాన్నీ అపనమ్మకాన్నీ బయట పెట్టకుండా వుండలేక పోయాడు అతను

"బంగారు చెంచాతో పుట్టిన కిరణ్ వంటి కుర్రాడు డబ్బూ - దస్కమూ మందీ - మార్బలమూ పుష్కలంగా వున్న కుర్రాడు ఇంటి నుంచి పారిపోయాడంటే నమ్మశక్యం కాకుండా వున్నది శశీ! మన రవిలాంటి కుర్రాడయితే తీరని కోర్కెలతో సతమత మవుతూ పెరుగుతూన్న అసంతృప్తిని తట్టుకోలేక అలిగి వెళ్ళిపోయాడన్నా అర్ధం వుంది! అన్నాడు భార్యతో

తీరా అనేసాక తన తప్పు గ్రహించి నాలుక కరచుకున్నాడు రవి పేరు ఎత్తి వుండకూడదేమో ననిపించడంతో గిల్టీగా భార్య ముఖంలోకి చూసాడు

శశికళ ఏదో అనబోయేంతలోనే రవి నవ్వి ఇలా అన్నాడు- కిరణ్‌కి ధనం పుష్కలంగా వుంది లేనిది ప్రేమానురాగాలే డాడీ! నాకు ధనం లేకపోవచ్చును కాని ప్రేమానురాగాలు పుష్కలంగా వున్నాయి!!

ఆ మాట అంటూంటే కొడుకు వదనంలోని వెలుగు, తేజస్సు కన్నులలో విరిసిన సంతృప్తి మెరుపూ- ఆ తల్లిదండ్రుల దృష్టిని తప్పించుకో లేదు

రవి పలుకులు ప్రతాపరావులో ఎనలేని ఆనందాన్ని కలిగించాయి

ఎంత చక్కగా వివరించాడు - తన మనస్సును!

ఇన్నాళ్ళూ రవిని గురించి ఏవేవో వూహించుకుని ఎంతటి అపోహకు గురయ్యాడు తాను! ఎంతగా మధన పడ్డాడు!!

హఠాత్తుగా గుర్తు కొచ్చింది అతనికి- అప్పుడప్పుడు కిరణ్ గురించి రవి చెప్పిన విషయాలు

కిరణ్ తండ్రికి బిజినెస్సే జీవితం!

తల్లికి తన మహిళా మండలి మీటింగులే లోకం!

ఒక్కనాడూ కొడుకును గురించి వారు శ్రద్ధతో పట్టించుకున్నదే లేదు ఒక్క పూటా కొడుకుతో కలిసి భోజనం చేసిందే లేదు

ఆకుర్రాడికి ఏలోటూ లేకుండా అన్నీ అమర్చడంతో తమ బాధ్యత తీరిపోయినట్టు భావించే ఆ తల్లిదండ్రులకు సంతాన మయిన కిరణ్ వంటి మంచి కుర్రాడు సయితం తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరమయి గుండెలలో అసంతృప్తిని పెంచుకోవడంతో విరక్తితో ఇల్లు విడిచి వెళ్ళిపోవడంలో ఆశ్చర్య మేముంది? అనిపించింది ఆలోచిస్తే ప్రతాపరావుకి

డాడీ!

సాలోచనగా వున్న తండ్రిని వుద్దేశించి మళ్ళీ అన్నాడు రవి

వియు నీడ్ లవ్- నాట్ రిచెస్! ఎస్ డాడీ! మా పిల్లలు కోరేది తల్లిదండ్రుల ప్రేమానురాగాలు వాటి తరువాతనే తక్కినవన్నీను!

బాబూ! రవీ! అంటూ పట్టరాని ఆనందంతో, అనురాగంతో కొడుకును కావలించుకున్నాడు ప్రతాపరావు

కొడుకు భావాన్ని అర్ధం చేసుకున్న శశికళ ప్రేమగా వాణ్ని వక్షానికి హత్తుకుని నుదుటిపైన ముద్దాడింది ◻

